# జెన్ జీరో ఇంక్

## - నిర్మలాదిత్య



### నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్ధిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మధనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ్(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్ధిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్ధల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే … )

## ‘దైవ ఘటన( ఆక్ట్ ఆఫ్ గాడ్)’

## (ముగింపు)

(జరిగిన కథ: లక్ష్మి కి అత్యవసరంగా పని చేయాలని, ఫ్రాన్స్ లో అతి పురాతన మైన దీవల్లి బ్యాంక్ నుండి ఒక ప్రాజెక్టు వస్తుంది. ఆ పని మీద ప్యారిస్ చేరుకున్న లక్ష్మి కి సింగపూర్ ఆఫీస్ పరిశీలన చేయమని బోర్డ్ మెంబర్ లూయి చెప్పాడు. అదివరకే పరిచయమున్న ఆ బ్యాంక్ సీ ఈ ఓ ఫిలిప్ ప్రవర్తనలో మార్పులు ఉన్నాయని లక్ష్మి గమనిస్తుంది. సింగపూర్ లో బ్యాంక్ ట్రేడర్ గా పని చేస్తున్న ఫిలిప్ ప్రియ శిష్యుడు స్టీవ్ అకస్మాత్తుగా సెలవు తీసుకొని వెళ్ళాడని, అక్కడ అతను చేస్తున్న పనిలో కూడా అనుమానాలు ఉన్నాయని, లక్ష్మి సింగపూర్ ఆఫీస్ కు బయలు దేరుతుంది. సహాయానికి ఆయేషను సింగపూర్ కు పిలిపిస్తుంది.)

**చాంగీ** ఎయిర్పోర్ట్ ఎప్పుడూ అందంగానే కనిపిస్తుంది అనుకుంది లక్ష్మి. నిరంతరం ప్రయాణీకుల సౌకర్యం కోసం చేస్తున్న మార్పుల వల్ల ఎయిర్పోర్ట్ ఆహ్లాదకరంగా ఉండటమే కాక, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ లాంటి అడ్డంకులు కూడా నిమిషాల మీద దాటి ఎయిర్పోర్ట్ బయటకి రాగలిగింది లక్ష్మి.

అంతకు ముందే సింగపూర్ చేరిన ఆయేష లక్ష్మి ని చూసి, నవ్వుతూ ‘ ఎలా వుండింది నీ ప్రయాణం’ అంటూ హగ్ చేసుకుంది. ఇద్దరూ కలిసి టాక్సీలో ఆర్చర్డ్ రోడ్డు లో ఉన్న హోటల్ చేరారు.

తూర్పు ప్రయాణం చేయడం వల్ల ఒక రోజంతా పోయింది అన్న ఆలోచన లక్ష్మి మెదడును తొలిచేస్తున్నది. కానీ సింగపూర్ వస్తే కానీ ఈ కేసు పరిష్కరించడం అసాధ్యం అని లక్ష్మి కి ప్యారిస్ లో అవగత మైపోయింది. ఆయేష కూడా ఇప్పుడు కేసు పని లో సహాయ పడటం వల్ల, వారాంతంలో ఈ కేసు ఒక కొలిక్కి రావచ్చు అని నమ్మకం కలిగింది లక్ష్మికి. హోటల్ చేరిన తరువాత కూడా ఈ కేసు మీద లక్ష్మి, ఆయేష లు ఒక గంట మాట్లాడుకొని తరువాత పడుకొన్నారు.

మరుసటి రోజు హోటల్ లోనే బ్రేక్ఫాస్ట్ ముగించుకొని, లక్ష్మి, ఆయేషలు సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ లో ఉన్న దీవల్లి బ్యాంక్ కు వెళ్లారు.

వీరొస్తున్నట్టు, ముందే తెలిసినందు వల్ల ఆ ఆఫీస్ డైరెక్టర్ వీరిని సాదరంగా ఆహ్వానించి, వారికి కేటాయించిన ఆఫీస్ రూం చూపెట్టాడు.

లక్ష్మి, పని ఈ డైరెక్టర్ తోనే మొదలెడదామని, “నాకు కొన్ని ప్రశ్నలున్నాయి. బహుశా వాటి సమాధానాలు మీకు తెలిసి ఉండ వచ్చు. తెలియకపోయినా, మీ ఆఫీస్ లో, ఆ సమాధానాలు తెలిసిన వారు మీకు తెలిసి ఉండాలి,” అంది డైరెక్టర్ తో.

“ష్యూర్. అడగండి,” అన్నాడు డైరెక్టర్.

“ముందు స్టీవ్ గురించి. అతను ఉన్నట్టుండి పని వదిలేసి వెళ్ళాడని తెలిసింది. మీకు కారణాలు తెలుసా? అతను చేస్తున్న ట్రేడింగ్ లో తేడాలు ఏమైనా వచ్చాయా?”

“స్టీవ్ మా బ్యాంక్ స్టార్ ట్రేడర్. అతను తెస్తున్న లాభాలు చూసి, మా సీ ఈ ఓ తనకే రిపోర్ట్ చేసేటట్లు ఒక పొజిషన్ స్టీవ్ కి ఇచ్చాడు. అతను చేసే ట్రేడింగ్ లావా దేవీలు మా ఆఫీసులో నుండి చేయడం నిజమే కానీ, వివరాలు ఆ స్టీవ్ కు, మా సి ఈ ఓ మాత్రం తెలిసి ఉంటుంది. బాటమ్ లైన్, అతను చేస్తున్న పనుల గురించి పెద్ద అవగాహన లేదు”

“సరే. మీ బ్యాంక్ అకౌంట్స్ డిపార్ట్మెంట్ హెడ్ ను ఒక సారి మాతో కలవ మంటారా? ఇంకో విషయం స్టీవ్ తో కలిసి పనిచేసే వారి వివరాలు కావాలి.’

"స్టీవ్ ట్రేడర్ కావడంతో ఒంటరి సమురాయ్ యోధుడు గానే పని చేసేవాడు. డైరెక్ట్ గా ఫిలిప్ కు రిపోర్ట్ చేయడం వల్ల, మేమంటే పెద్ద లెక్క లేదు. మా అకౌంట్స్ హెడ్ హనా ను పంపిస్తాను. స్టీవ్ కి ఇద్దరు అసిస్టెంట్లు ఉన్నారు. వారు స్టీవ్ తో బాటు ఒకే ఆఫీస్ రూం లో పని చేసే వారు. స్టీవ్ రూం నేనున్న ఆఫీస్ ఫ్లోర్ లోనే కుడి వైపు చివర్లో ఉంది."

"గ్రేట్. థాంక్స్," అని లక్ష్మి చెప్పడంతో ఆ డైరెక్టర్, తన ఆఫీస్ కు తిరిగి వెళ్ళిపోయాడు.

"లక్ష్మి, నువ్వు ఆ అకౌంట్స్ డిపార్ట్మెంట్ హెడ్ తో మాట్లాడు తావేమో కదా. నేను ఒక సారి ఆ స్టీవ్ రూం కు పోయి ఆయనకు పని చేస్తున్న వారితో మాట్లాడి వస్తాను," అంది ఆయేష.

కొంత సేపటికి, బిజినెస్ సూట్ వేసుకున్నావిడ తన పేరు హానా చాన్ అని, తను ఆ ఆఫీస్ అకౌంట్స్ హెడ్ అని పరిచయం చేసుకుంది.

లక్ష్మి నవ్వి,"నా పేరు లక్ష్మి. మీ డైరెక్టర్ చెప్పే ఉంటారు. స్టీవ్ చేస్తున్న ట్రేడింగ్ గురించి తెలుసుకోవాలని వచ్చాము."

స్టీవ్ మాట వింటూనే హానా కు చెమటలు పట్టేసాయి. "స్టీవ్ పనే చేస్తున్నాను. పోయిన వారం స్టీవ్ చేసిన ట్రేడింగ్ సెటిల్ మెంట్ కు వచ్చాయి. ఇప్పుడు మా బ్యాంక్ ను మిలియన్స్ కట్ట మని బిల్లు లు వచ్చాయి. ఏమి చేయాలో, ఎలా కట్టాలో తెలియటం లేదు"

"ట్రేడింగ్ అంటే అది మామూలే కదా. ట్రేడింగ్ అయ్యిన తరువాత డబ్బు సెటిల్మెంట్ చేస్తున్న ఎక్సేంజ్ లకు డబ్బు పంపాడమో, లేదా అక్కడి నుండి తెచ్చుకోవడమే జరుగుతుంది."

"కానీ స్టీవ్ చేస్తున్న ట్రేడింగ్ లెక్కలు అన్నీ స్టీవ్ నే చూసుకుండే వాడు. ఇప్పుడొచ్చిన బిల్స్ నేను చూసుకుంటున్న అకౌంట్ల ద్వారా పే చేయలేను. స్టీవ్ ఇలాంటి బిల్స్ ఎక్కడ నుండి పే చేసే వాడో తెలియదు. స్టీవ్ ఇదివరకు ఎప్పుడు ఇలా మూడు రోజులు ఆఫీస్ కు రాకుండా ఉండలేదు. అసలు అతను వెకేషన్ తీసుకొంది కూడా గుర్తు లేదు."

ఏండ్ల కొద్దీ, వెకేషన్ తీసుకో కుండా పని చేస్తున్నాడు ఒక ఉద్యోగి అంటే అది ఒక పెద్ద రెడ్ ఫ్లాగ్. ఆ ఉద్యోగి పని తీరు అనుమానస్పదమే. స్టీవ్ పని కూడా బాగా చెక్ చేయాలి అనుకుంది లక్ష్మి.

"స్టీవ్ పని వదిలి పోయినట్లు విన్నాను. ఈ బిల్స్ మీరు సెటిల్ చేయాల్సిందే. మీ బ్యాంక్ అకౌంట్లు మరో సారి పరిశీలించి చూడండి. మీకు స్టీవ్ ఎలా తన ట్రేడింగ్ లావా దేవీలు బ్యాంక్ పుస్తకాలలో రాసే వాడో తెలుస్తుంది. మీకు ఆ విషయం తెలిసిన వెంటనే నాకు ఫోన్ లేదా పింగ్ చేయండి. మళ్లీ మనం మాట్లాడు కుందాం," అంది లక్ష్మి.

హానా లేచి తన భాషలో ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయింది. స్టీవ్ సెలవు పెట్టి, అనవసరంగా ఈ పెంట తన తల మీద పెట్టాడే అన్న నిస్పృహ హానా గొంతులో ధ్వనించింది లక్ష్మికి.

పని ఎక్కువ వుండడం వల్ల, లక్ష్మి డెస్క్ వద్దే తినడానికి, బ్యాంక్ వాళ్లకు చెప్పి లంచ్ తెప్పించుకుంది. మిలియన్స్ ఎక్చేంజ్ వాళ్ళతో సెటిల్ చేయాలని ఒక బ్యాంక్ అవస్త పడటం తను ఇదివరకు ఎక్కడా చూడలేదు. బ్యాంక్ లు వ్యాపారం చేసేటప్పుడు ప్రతీ కొనుగోలు, లేక అమ్మకం బ్యాంక్ తీసుకోగల రిస్క్ పరిమితులలోనే చేస్తారు. స్టీవ్ చేస్తున్న ఉద్యోగం ప్రకారం, అతను ఒక మిలియన్ కంటే ఎక్కువ నష్టం రాగల ట్రేడ్ చేయాలి అంటే పై అధికారి కి చెప్పి, ఆ అధికారి అనుమతి తీసుకోవాలి. ఆ పై అధికారికి పది మిలియన్ల వరకు రిస్క్ తీసుకోవచ్చు అని లిమిట్ ఉండవచ్చు. రిస్క్ ఆ పది మిలియన్ల పైకి పోయే టట్లు ఉంటే ఆ పై అధికారి, అలా సీ ఈ ఓ, బోర్డ్ ల వరకు బ్యాంక్ ఆర్థిక స్థితి బట్టి లిమిట్స్ ఉంటాయి.

అలాంటిది స్టీవ్ ఇలా మిలియన్ల కొద్దీ ఎక్చేంజ్ ల ద్వారా బ్యాంక్ పేరు మీద వ్యాపారం చేస్తున్నాడంటే లక్ష్మి కి తన మదిలో మెదులుతున్న అనుమానం దృఢ పడింది. స్టీవ్ బ్యాంక్ వదిలి పోవడం ఆ అనుమానం బల పడటానికి మరో కారణం.

లక్ష్మి , బ్యాంక్ ఎక్చేంజ్ లకు కట్ట వలసిన డబ్బులు వెనుక ఉన్న, వ్యాపారాలను నిశితంగా పరిశీలించ సాగింది. స్టీవ్ ఎక్కువగా సింగపూర్, హాంకాంగ్, జపాన్ స్టాక్ ఎక్చేంజి లలో పని చేస్తున్నాడు. సింగపూర్, హాంకాంగ్ లెక్కలు సరిపోయాయి. అవి స్టీవ్ కున్న పరిధులలో నే ఉన్నాయి. హానా ఆ రెండు ఎక్చేంజి లలో స్టీవ్ చేసిన ట్రేడ్స్ సెటిల్ కూడా చేసేసింది. కాబట్టి అక్కడ అనుమాన పడాల్సింది ఏమి కనపడలేదు.

జపాన్ ఎక్చేంజ్ లో స్టీవ్ చేసిన వ్యాపారాలు చూసే సరికి, లక్ష్మి కి హానా పడుతున్న వేదన అర్థం అయ్యింది. అక్కడ బ్యాంక్ ఎక్చేంజ్ తో చేసిన వ్యాపారం మిలియన్స్ కాదు బిల్లియన్స్ లో ఉంది. తనకు తెలిసి ఆ లెవెల్ లో వ్యాపారం చేయడానికి సీ ఈ ఓ ఫిలిప్ నుంచి మాత్రమే కాదు, బోర్డ్ నుండి కూడా అనుమతి కావాలి. ఒక వేళ స్టీవ్ అడిగినా ఇచ్చే వారు కాదు.

లక్ష్మి వెనక్కు వెళ్లి స్టీవ్ జపాన్ ఎక్చేంజి లో చేసిన వ్యాపారాలు చూసింది. స్టీవ్ చేసిన వ్యాపారాలు మిలియన్స్ తో మొదలై బిలియన్లలకు అతి కొద్ది సమయంలోనే చేరుకున్నాయి. కానీ ఇలా కట్ట లేనంత నష్టాల పరిస్థితి ఎప్పుడూ రాలేదు. ఇది వరకు స్టీవ్ ఎదుర్కొనని నష్టం ఇప్పుడు ఎలా వచ్చింది అని లక్ష్మి పాత ట్రేడ్స్, ఇప్పటి వాటికి ఉన్న తేడాలు లోతుగా చూడడం మీదకు బెట్టింది.

పొద్దున్న స్టీవ్ టీమ్ లో పని చేస్తున్న వారితో మాట్లాడి వస్తాను అని చెప్పి పోయిన ఆయేష తిరిగి వచ్చింది

"హలో ఆయేష, లంచ్ అయ్యిందా? ఏమైనా లీడ్స్ దొరికాయా?" అడిగింది లక్ష్మి.

"ఆ లంచ్ అయ్యింది. అక్కడే మనం వెదుకుతున్న సమాధానం ఒకటి దొరికింది," అంది ఆయేష.

"స్టీవ్ ఉన్నంటుండి వెళ్లిపోయినందుకు కారణమా?"

"అలాంటిదే అనుకో. స్టీవ్ కింద పని చేస్తున్న వారితో మాట్లాడు తున్నప్పుడు, గ్రేస్ తో బాగా కనెక్ట్ అయ్యాను. స్టీవ్ తన మెంటార్ అని, స్టీవ్ పట్ల ఆరాధనా భావంతో మాట్లాడడం మొదలెట్టింది. ఆ ఆరాధన భావమే, నన్ను అలెర్ట్ చేసింది. గ్రేస్ తో మరింత సమయం గడిపాను. చివరకు లంచ్ కు మంచి రెస్టారెంట్ ఏదైనా చెప్పమని, తనను కూడా నా వెంట తను రికమెండ్ చేసిన రెస్టారెంట్ కు వెళ్ళాము. అక్కడ లంచ్ చేస్తున్నప్పుడు మరింత దగ్గిరయ్యింది, గ్రేస్. మాటల్లో తను పొరబాటున చేసిన ట్రేడ్ లో కొన్ని మిలియన్ల నష్టం వస్తే, స్టీవ్ తనను నిస్పృహ పడవద్దని, మళ్లీ రెట్టింపు వ్యాపారం అదే ఎక్చేంజ్ లో చేయమంటే, ఎలా గొప్ప లాభం వచ్చిందని, ఎలా అంతకు ముందు రోజు వచ్చిన నష్టం ఎవరి కళ్లకు కనపడకుండా దాచేయగలిగామో చెప్పింది."

"ఒక రోజు నష్టం వస్తే, మరుసటి రోజు ఆ నష్టం పూడ్చి, మరింత లాభాలు రావాలని రెట్టింపు పెట్టుబడితో వ్యాపారం చేయడం జూదగాళ్ళు చేసే పని. బ్యాంకులు చేయవు. స్టీవ్ పారిపోవడానికి మనకు ఒక కారణం దొరికింది. ఇక మిగిలింది, ఆ కారణం సరి అయ్యిందని చెప్పగలిగే బ్యాంక్ రికార్డ్స్. అన్నట్లు, గ్రేస్ నష్టం వచ్చిందన్న రోజు స్టీవ్ ఆ నష్టం ఎలా కప్పి పుచ్చాడో అడుగావా?"

"అడిగాను. అక్కడి కే వస్తున్నాను. స్టీవ్ బ్యాక్ ఆఫీస్ లో అడ్జస్ట్మెంట్ అకౌంట్ ఒకటి తెరిచాడు. ఆ అకౌంట్లో ఇలాంటి నష్టాలు పెట్టేసి, బ్యాంక్ లో పై వారికి తెలీకుండా జాగ్రత్త పడే వాడని చెప్పింది. అసలు గ్రేస్ చేసిన తప్పు బయట పడకూడదనే ఆ అకౌంట్ తెరిచాడు అని స్టీవ్ ను తెగ పొగిడింది."

"ఇప్పుడే లంచ్ నుంచి వస్తున్నావు కాబట్టి, నువ్వు ఆ అకౌంట్ చూసి ఉండవు అనుకుంటాను. ఏదీ ఆ అకౌంట్ వివరాలు చెప్పు, ఇద్దరం ఒక సారి చూద్దాం . నేను ప్రస్తుతం వెదుకుతున్న సమాధానం కూడా ఆ అకౌంట్ లోనే ఉండ వచ్చు."

ఆయేష చెప్పిన వివరాల బట్టి ఆ అకౌంట్ తొందరగానే పట్టుకున్నారు. గ్రేస్ చెప్పింది నిజమే. ఆ అకౌంట్ గ్రేస్ తప్పులు కప్పి పుచ్చడానికే స్టీవ్ ఓపెన్ చేసాడు. గ్రేస్ చెప్పినట్లే గ్రేస్ వల్ల వచ్చిన నష్టం ఒక వారంలోనే పూడ్చేయ గలిగాడు. కానీ అటు తరువాత అలాంటి అడ్జస్ట్ మెంట్ లు చాలానే కనిపించాయి. వాటికి గ్రేస్ కు సంబంధం ఏమి లేదు. అసలు వాటి వివరాలు కూడా గ్రేస్ కు తెలియదు. మిలియన్ల కొద్దీ వ్యాపారాలు ఆ అకౌంట్ లో ఉన్నాయి.

"లక్ష్మి, ఈ మిలియన్ల లో ఉన్న వ్యాపారాలు గ్రేస్ చేసి ఉండదు. తన దగ్గర ఆ నేర్పు, జ్ఞానం లేదు. ఇవన్ని స్టీవ్ చేసి ఉండాలి," అన్నది ఆయేష.

"అవును నీవన్నది నిజమే. మొదట్లో గ్రేస్ తప్పు కాయడానికి అకౌంట్ తెరిచినా, తన తప్పులు కప్పి పుచ్చు కోవడానికి కూడా స్టీవ్ ఈ అకౌంట్ ఉపయోగించి ఉండాలి. అసలు నేను ఇదివరకు కన్సల్టెంట్ గా చెప్పినట్లు బ్యాంక్

తన రిస్క్ మనేజిమెంట్ లోటు పాట్లను సరి చేసుకొని వుంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఫ్రంట్ ఆఫీస్ కి వ్యాపారం చేస్తున్న స్టీవ్ కు బ్యాక్ ఆఫీస్ లో అకౌంట్స్ చూస్తున్న గ్రూప్ తో ఎలాంటి సంబంధం ఉండ కూడదు. అలాంటిది ఏకంగా, ఈ బ్యాంకులో స్టీవ్ తనే ఒక అకౌంట్ ఓపెన్ చేసి, దాంట్లో తన తప్పుడు లావాదేవీలు, అందువల్ల కలిగిన నష్టాలు దాచుకో గలిగాడు. అందుకే బ్యాంకు ఈ పరిస్థితిలో ఉంది."

"మరి స్టీవ్ అకస్మాత్తు గా పారి పోవాల్సిన పరిస్థితి ఎలా వచ్చింది?"

"ఇందాక బ్యాక్ ఆఫీస్ మేనేజర్ హానా వచ్చింది. తను స్టీవ్ మిగిల్చిన వ్యాపారాలను చూపెట్టింది. అవి బిలియన్ల లో ఉన్నాయి. ఆ డబ్బంతా బ్యాంక్ కట్టాల్సి ఉంది. అంత డబ్బు ప్యారిస్ లో ఉన్న వారికి తెలియకుండా కట్టడం అసాధ్యం. ఇది వరకు లాగా, అంత మొత్తం ఇలాంటి అకౌంట్లో తను కప్పి పుచ్చ లేడని తెలిసి పోయి ఉండాలి. అందుకే పారిపోయాడు."

"స్టీవ్ పారిపోయినందుకు కారణం దొరికినట్లే కదా."

"అవును. గ్రేట్ వర్క్. థాంక్స్ ఆయేష. కానీ ఇదివరకు రాని ఇంత పెద్ద నష్టం ఈ సారి ఎలా వచ్చింది? అదే అర్థం కావటం లేదు. ఏదో గొప్ప ఉపద్రవం జరిగినట్లే ఉంది."

"ఉపద్రవం అంటే నేను భూకంపం వల్ల జపాన్ లో ఇరుక్కున్న సమయమే గుర్తుకు వస్తున్నది," నవ్వింది ఆయేష.

"ఓహ్ మై గాడ్. ఇప్పుడు అన్నీ ముక్కలు సరిగా పడి స్టీవ్ సృష్టించిన జిగ్ సా ఫజిల్ బొమ్మ స్పష్టంగా కనపడుతుంది. స్టీవ్ కి వచ్చిన నష్టం ఉపద్రవం వల్లే కలిగింది. స్టీవ్ జపాన్ లో ఉన్న ఎక్చేంజ్ ఇండెక్స్ విలువ పడిపోయే అవకాశం లేదని పెద్ద బెట్ కట్టాడు. ఇది సేఫ్ బెట్. కానీ నువ్వు చెప్పిన భూకంపం వల్ల ఆ జపాన్ ఎక్సేంజ్ ఇండెక్స్ బాగా పడిపోయింది. స్టీవ్ కప్పి పుచ్చ లేని నష్టం కలిగించింది."

"అంటే ప్రకృతి వల్ల జరిగిన ఒక అరుదైన సంఘటన వల్ల ఈ ఫ్రాడ్ బయట పడిందా! నువ్వాన్నది కరెక్టే. బ్యాంక్ కు అత్యధికంగా నష్టం వచ్చిన రోజు ముందు రాత్రి ఈ భూకంపం వచ్చింది. అంటే ఒక రోజు లోనే స్టీవ్ వల్ల బ్యాంక్ కు ఊహించలేనంత నష్టం జరిగింది," అంది ఆయేష.

"మనం వచ్చిన పని అయ్యి పోయినట్లే. కానీ మనం బోర్డ్ లో ప్రజెంట్ చేయాలంటే, వివరాలు కావాలి కదా. నువ్వు స్టీవ్ మొదలెట్టిన ఈ అకౌంట్ మొత్తం పరిశీలించి, ఒక రిపోర్ట్ ఇవ్వు. అది నా బోర్డ్ ప్రెజెంటేషన్ కు ఉపయోగ పడుతుంది."

ఆయేష తో మాటలు అయ్యాక, దీవిల్లి బ్యాంక్ అధికార్లకు, స్టీవ్ చేసిన ఫ్రాడ్ గురించి చెప్పాలి అని ఫోన్ తీసింది. సి ఈ ఒ ఫిలిప్ కు చేయాలా, లేక బోర్డ్ మెంబర్ లూయీ కి చేయాలా అని ఒక నిమిషం ఆలోచించింది. ఈ ఫ్రాడ్ అవ్వడానికి పరోక్షంగా ఫిలిప్ కూడా కారణమే. లాభాల వేటలో, బ్యాంక్ లో ఉండవలసిన రిస్క్ మేనేజ్మెంట్ నియమాలు

స్టీవ్ లాంటి ఉద్యోగులు ఉల్లంఘిస్తున్నారు అని తెలిసినా, వాటిని పట్టించుకోకుండా లాభాలు తెస్తున్నారని, అలాంటి వారికి ప్రమోషన్లు, బోనస్ లు ఇవ్వడం వల్లే బ్యాంక్ ఈ స్థితి లో ఉంది. స్టీవ్ చేసిన నష్టాలు పూడ్చి పెట్టి, అనూహ్యమైన లాభాలు చూపెడితే, అది తన నాయకత్వం వల్లే అనుకున్నాడు ఫిలిప్. ప్రపంచానికి చాటుకున్నాడు కూడా.

ఇప్పుడు స్టీవ్ చేసిన ఫ్రాడ్ మొత్తం చూస్తే బ్యాంక్ పెట్టుబడి మొత్తం కొట్టుకు పోయేటట్లు ఉంది. ఇంత పెద్ద ఎత్తులో ఫ్రాడ్ ఇది వరకు ఎప్పుడు జరుగ లేదు. మొత్తం బ్యాంకింగ్ రంగాన్నే కుదిపే ఫ్రాడ్. ప్రపంచంలో అన్ని దేశాల రిజర్వ్ బ్యాంక్ లాంటి రెగ్యులేటర్ లను కుదిపేసే ఫ్రాడ్.

లక్ష్మి బోర్డ్ మెంబర్ లూయి కి ఫోన్ చేసింది.

"లూయి స్పీకింగ్. ఎంటి అర్జెంట్ గా మాట్లాడాలన్నా వట. ఇప్పుడు అర్ధ రాత్రి ఒంటి గంట అయ్యింది."

"సారీ టు వేక్ యూ అప్. కానీ విషయం పొద్దున వరకు ఆగ గలిగేది కాదు. సింగపూర్ ఆఫీస్ లో పెద్ద ఫ్రాడ్ బయట పడ్డది."

"ఎలాంటి ఫ్రాడ్. ఎంత మొత్తం."

"స్టీవ్ అధికారం లేకుండానే, పెద్ద ఎత్తున బ్యాంక్ పేరు మీద స్టాక్ ఎక్స్ఛేంజ్ లలో వ్యాపారం చేశాడు. ఇంకా అకౌంట్ పుస్తకాలు చూస్తున్నాము. ఫ్రాడ్ మొత్తం, ఇంచుమించు ఒకటి, ఒకటింపావు బిలియన్ లు ఉంటాయనిపిస్తుంది."

"మిలియన్స్ ఆర్ బిల్లయన్స్?" లూయి నిద్ర మత్తు దిగి పోయింది.

"బిలియన్స్. అందుకే మిమ్మల్ని లేపాను," అంది లక్ష్మి.

కొన్ని క్షణాల నిశబ్దం చాలా సేపనిపించింది, లక్ష్మి కి.

చివరకు లూయి తేరుకొని, "నేను ఇక్కడ చేయవలసిన పనులు చేస్తాను. వెంటనే ఫిలిప్ తో మాట్లాడి బోర్డ్ మెంబెర్స్ కి కబురు చేయాలి. ఇక్కడి బ్యాంక్ ది ఫ్రాన్స్, లా ఎన్ఫోర్స్మెంట్ వాళ్లకు కూడా చెప్పాలి. నువ్వు రేపు ఫ్లైట్ తీసుకొని వెంటనే ఇక్కడికి వచ్చేయి. నువ్వు ఫ్లైట్ ఎక్కే లోపల విషయం బయటకి పొక్కితే, అక్కడి ప్రభుత్వం నిన్ను సింగపూర్ వదలనివ్వదు. వాళ్ళ ఇన్వెస్టిగేషన్ కు అవసరం అని అక్కడే ఉంచేసుకుంటారు. ఇక్కడ మాకు నీ అవసరం ఎక్కువ. కనీసం మరో పది రోజులు ప్యారిస్ లోనే ఉండేటట్లు ఏర్పాట్లు చేసుకో," అని పెట్టేసాడు.

సాయంత్రానికి ఆయేష తన రిపోర్ట్ తో వచ్చింది. లక్ష్మి ఆ రిపోర్ట్ మరో సారి చెక్ చేసింది. పెద్దగా మార్పులు చేయనవసరం కనపడ లేదు. ఫ్రాడ్ మొత్తం 1.3 బిలియన్ లు అని తేలింది.

లక్ష్మి, ఆయేష కు లూయి తో జరిగిన సంభాషణ చెప్పింది.

"ఆయేష, నువ్వు కూడా నాతో పాటు ప్యారిస్ లో ఉండాల్సి వస్తుంది," అంది లక్ష్మి.

"వచ్చే వారం టాంపా చేరి, అక్కడ మన ఆఫీస్ లో కొత్త ప్రోజెక్ట్ మొదలు పెడదాం అని అనుకున్నాం కదా."

"అవును. ఆ ప్రోజెక్ట్ క్లయింట్ మీటింగ్ మరో రెండు వారాల తరువాత కానీ కాదు. ఈ రెండు వారాలు, ఆ కొత్త ప్రోజెక్ట్ కు చేయవలసిన గ్రౌండ్ వర్క్, మన దగ్గర పనిచేస్తున్న ఇంటర్న్స్ ద్వారా చేయించు. వారితో ప్రతీ రోజు ఒక అరగంట మీటింగ్ లు పెట్టావంటే, మనం ప్యారిస్ నుంచే ఆ పని కూడా చూసుకో వచ్చు," అంది లక్ష్మి.

ప్యారిస్ కి ఫ్లైట్ పొద్దున్నే మూడు గంటలకి దొరికింది. ఎయిర్పోర్ట్ లో ఫ్లైట్ కోసం వెయిట్ చేస్తూ, లారెన్స్ కి ఫోన్ చేసింది లక్ష్మి.

"హలో హనీ, ఎలా ఉన్నావు?"

"సర్ప్రైజ్. ఏంటి లక్ష్మి ఈ సమయంలో? మీకు అర్ధ రాత్రి ఒకటో, రెండు గంటలు అయ్యి ఉంటుందేమో కదా?"

"అవును. రెండు గంటలు. మరో గంటలో ఫ్లైట్. గేట్ దగ్గర నేను, అయేష వెయిట్ చేస్తున్నాము."

"అప్పుడే తిరుగు ప్రయాణమా? పని సంగతేమిటి?"

"యూ ఎస్ కాదు. ప్యారిస్ కి పోతున్నాము. మేము చేస్తున్న ఇన్వెస్టిగేషన్ పూర్తి అయ్యింది. కాని రిపోర్టులు వ్రాయాలి. ఇంకా చేయవలసిన తతంగం చాలా ఉంది. మరో మూడు వారాలు కనీసం పడుతుందనుకుంటాను. ఈ సమయం ప్యారిస్ లో నే ఉండాలి."

"అదేంటి నీ ఇన్వెస్టిగేషన్ తరువాత రెండు మూడు రోజులలో నీ పని పూర్తి అవ్వాలి కదా. నువ్వు రోజుల బదులు వారాలు అంటున్నావు. జెట్ లాగ్, నిద్ర లేక పోవడం వల్ల దినాలు వారాలుగా మారి పోలేదు కదా."

"నీతో మాట్లుడుతుంటే అవ్వన్ని మాయమై పోతాయి. అవును నిజంగానే దినాలు వారాలు అయ్యాయి. ఇదో క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ గా రూపంతరం చెందింది. నీకు విషయం ఒకటి, రెండు రోజులలో తెలిసిపోతుంది."

లారెన్స్ కు విషయం చూచాయగా అర్థం అయ్యింది. లక్ష్మి నిఇప్పుడే అన్ని విషయాలు అదీ తనున్న పబ్లిక్ ఎయిర్పోర్ట్ స్థలంలో చెప్పమనడం సరి కాదని లారెన్స్ కు తెలుసు. అందుకే విషయం మార్చి," ఇది మరీ అన్యాయం. వచ్చే వారం మళ్లీ ఇక్కడ టాంపా లో ఉంటావనుకున్నాను. బీచ్ లు నువ్వు లేక బోసి పోతున్నాయి,' అన్నాడు.

"అవును నాకు కష్టంగానే ఉంది. రెండు వారాల తరువాత వీకెండ్ కి నువ్వు ఆమ్ స్టెర్డాం ఎందుకు రాకూడదు. అక్కడా మ్యూజియం లు ఉన్నాయి. తులిప్ పువ్వుల సీజన్ కూడా."

"సరే చూస్తాను. తులిప్ పువ్వులు కోసమన్న ప్రయత్నిస్తాను. లాస్ట్ టైం నేను అక్కడ పోయినప్పుడు సీజన్ కాదు. 17వ శతాబ్ది లోనే తులిప్ మేనియా అని అక్కడి ఆర్థిక వ్యవస్థను ప్రజల ఊహాగానాల తో అస్తవ్యస్తం చేశారు. నా కెందుకో తులిప్ అన్నప్పుడెళ్ళ ఆ చరిత్ర నే గుర్తుకు వస్తుంది."

"నువ్వు చేస్తున్న క్రైం ఇన్వెస్టిగేషన్ పని వల్లే అలా తేడా గా ఆలోచిస్తున్నావు. నాతో ఉన్నప్పుడు పూలను పూల గానే చూసి సంతోషించు. బోర్డింగ్ అనౌన్స్ చేశారు. ట్రిప్ వివరాలు మళ్లీ మాట్లాడుకుందాం."

లక్ష్మి ఫ్లైట్ లో బాగా నిద్ర పోయింది. ప్యారిస్ లో దిగేసరికి మధ్యాహ్నం అయ్యింది. ఫోన్ తీసి మెసేజెస్ చూస్తుంటే, న్యూస్ అలెర్ట్ పాప్ అయ్యింది. స్టీవ్ ను మకౌ ద్వీపం నుండి బ్యాంకాక్ పోతుండగా అరెస్ట్ చేశారని వార్త వచ్చింది. దానితో పాటు బ్యాంక్ లో ఫ్రాడ్ జరిగిందని. ఫ్రాడ్ వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, బ్యాంక్ నుంచి స్టేట్ మెంట్ కూడా విడుదల అయ్యింది. లూయి తను చెప్పిన వివరాలు బోర్డ్ తో పంచుకొని ఉండాలి. అలానే స్టీవ్ విషయం నేర పరిశోధకులకు చెప్పి ఉండాలి.

లక్ష్మి ఎయిర్పోర్ట్ నుండి, నేరుగా బ్యాంక్ కే వెళ్ళింది. అప్పటికే బోర్డ్ తన దగ్గర నుంచి వివరాలు నేరుగా వినాలి అని అత్యవసరంగా కలిసింది.

లక్ష్మి స్టీవ్ ఈ విధంగా బ్యాంక్ కు నష్టాలు కల్పించి, ఎలా దాచి పెట్టగలిగాడు అని వివరిస్తుంటే, బోర్డ్ లో ఉన్న అందరూ సభ్యులకు షాక్ లాగా తగిలింది. నష్టం ఒకటింపావు బిలియన్ డాలర్ల పై బడి ఉండొచ్చు అని లక్ష్మి చెప్పగానే, మూడు వందల ఏళ్ల చరిత్ర గల ఈ బ్యాంక్ ఎలా తట్టుకో గలదో ఎవరికి అర్థం కాలేదు.

లక్ష్మి కళ్ళకి ఈ బ్యాంక్ కు ఉన్న నష్టం భరించే మరో బ్యాంక్ ఏదీ కనపడ లేదు. దీవల్లి బ్యాంక్ ను ఆదుకోగల పెద్ద బ్యాంక్ లు ప్రపంచంలో ఒక పది కూడా లేవు. అవి కూడా ఈ బ్యాంక్ లో ఉన్న ప్రస్తుత సంస్కృతి, విలువలు; ఫ్రాడ్ లో ఇరుక్కున్న పెద్ద మొత్తం తెలిస్తే వెనుకంజ నే వేస్తాయి.

బోర్డ్ లో ఫిలిప్ కూడా కూర్చుని ఉన్నాడు. లక్ష్మి కి ఇది వరకటి ఫిలిప్ కనపడ లేదు. ఇంతకు ముందు ఎదురు లేని రాజు లాగా బ్యాంక్ ను ఏలిన వాడు, ఈ రోజు కుర్చీ లో అణిగి పోయి కూర్చున్నాడు. వీలైతే ఆ కుర్చీలోనే మాయ మవ్వాలి అన్నట్లు కుర్చీలో పూర్తిగా ఒదిగి పోయాడు.

లక్ష్మి అంతకు ముందు గర్వంగా స్టీవ్ ను పరిచయం చేసిన ఫిలిప్ గుర్తుకు వచ్చాడు. స్టీవ్ తెలివైన వాడు. ఏదో శిక్ష ముగించుకున్న తరువాత, బ్యాంక్ సెక్యూరిటి లో ఎక్స్పర్ట్ అని ఒక పుస్తకం వ్రాయడం తోనో, మరో కంపనీ లో ఉన్నత ఉద్యోగం లో చేరుతాడు. లూయి, మరో పెద్ద కంపెనీకి చైర్మన్. వంశ పారంపర్యంగా వస్తున్న ఆస్తులకు వారసుడు. అతన్ని తమ బోర్డ్ లో చేరమని కోరే కంపెనీలకు కొదువ లేదు.

ఫిలిప్ ను చూస్తే లక్ష్మి కి జాలి వేసింది. ఫిలిప్ కు ఇంక ఆర్థిక ప్రపంచంలో ఏ స్థానం దొరకదు. బ్యాంక్ ను సరిగా చూసుకోలేదని జైలు పాలు కాకుంటే చాలు. అతను ఆర్థిక రంగంలో ఇకపై, అంట రాని వాడే. ఈ ఆలోచన పరంపరలో లక్ష్మి జాలి మాయమైంది. ఫిలిప్ కు తగిన శిక్ష నే పడబోతున్నందుకు, ఎందుకో తృప్తి గా అనిపించింది.

తరువాతి మూడు వారాలు బ్యాంక్ బోర్డ్, పోలీస్/క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్, బ్యాంక్ ది ఫ్రాన్స్ , ఇతర దేశాల రిజర్వ్ బ్యాంక్ ల మీటుంగ్లతో ఇట్టే గడిచిపోయాయి. దీవల్లి బ్యాంక్ దివాలా తీయడం తప్ప మరో మార్గం లేదన్న నిర్ణయానికి బ్యాంక్ రెగ్యులేటర్ లు, ప్రభుత్వాలు వచ్చేశాయి. వందల ఏళ్ల చరిత్ర ఉన్న బ్యాంక్ అంత్యక్రియలకు ప్రయత్నాలు మొదలయ్యాయి.

పని అయిపోవడంతో, ఆయేష గత వారమే టాంపా తిరిగి వెళ్ళిపోయింది. లక్ష్మి చివరకు మిగిలిన కొన్ని పనులు ముగించుకొని, తరువాతి వీకెండ్ లారెన్స్ తో కలిసి నేదర్లాండ్స్ చూసి టాంపా తిరిగి వెళ్ళాలనుకుంది. ఆ రోజు సాయంత్రం కట్టాల్సిన బిల్స్, తన అకౌంట్లు చూస్తుండగా ఫిడిలిటీ ఇన్వెస్ట్మెంట్ అకౌంట్ లో ఆ రోజే స్టాక్ మార్కెట్ విడుదల అయ్యిన కొత్త టెక్ కంపనీ గురించిన వివరాలు ఉన్నాయి.

ఆ కొత్త టెక్ కంపనీ 20 డాలర్ల ధరతో మార్కెట్ లో వస్తె, దాని విలువ 80 డాలర్లకు పెరిగి పోయింది. ఆ కంపెనీలో ఇంతకు ముందు అంకురం దశలోనే ఇన్వెష్ట్ చేసిన వారికి గొప్ప లాభాలు వచ్చి వుండాలి. ఆ కంపెనీ లో అలా పెట్టుబడి ఉన్న వారి పేర్లు చూసింది. అందులో ఎక్కువ పెట్టుబడి పెట్టి, దాదాపు బిలియన్ డాలర్ల పైన లాభం పొందిన వారిలో, ఫిలిప్ పేరు ఉంది.

★దైవ ఘటన – అనుకోని ఉపద్రవాల(భూకంపం, తుఫాను లాంటివి) వల్ల నష్ట పోకుండటానికి, వ్యాపార కాంట్రాక్ట్ లలో ఫోర్స్ మజ్యూరు అన్న ప్రస్తావన ఉంటుంది. అలా, ప్రకృతి ఉపద్రవాల వంటి దైవ సంఘటనలు జరిగినప్పుడు కాంట్రాక్ట్ చెల్లదని వ్యాపారస్తులు ఈ ఫోర్స్ మజ్యూర్ వాక్యాలతో జాగ్రత్త పడతారు.

Post your comments